ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 17 మార్చి 2024




ఏసీబీ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

- వరంగల్, హనుమకొండ కోర్టుల ముందంజ
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే
- ఏసీబీ, హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభం

7



'లోక్‌సభ'కు

మోగిన పార్లమెంట్ ఎన్నికల నగారా

- షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఉమ్మడి జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ స్థానాలు
- గెలుపే ధ్యేయంగా ప్రచార పర్వంలోకి ప్రధాన పార్టీలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాజకీయపార్టీలు లోక్‌సభ సమరానికి సై అంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. నాలుగో దశలో మే 13న రాష్ట్రంలోని అన్నిపార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేయగా.. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులకు, అభ్యర్థుల సమగ్ర వివరాల కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్‌లను కూడా విడుదల చేసింది. మరోవైపు షెడ్యూల్ ప్రకటనతోనే శనివారం నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసే దిశగా అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకున్న ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు వ్యూహరచన చేసుకుంటున్నారు. శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ పథకాల అమలుకు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది. కోడ్ ముగిసే వరకు అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉండదు.

విస్తృత ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కీలకమైన ప్రాంతాలు, జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తితే, దానికి సంబంధించిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఇక వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 1,893 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. అత్యధికంగా పాలకుర్తి నియోజకవర్గంలో 294 కేంద్రాలు, స్టేషన్‌ఘనపూర్ పరిధిలో 290 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 1,783 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా ములుగులో అత్యధికంగా 209, మహబూబాబాద్‌లో 184 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నారు. దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా, ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన వెలుగు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అభ్యర్థికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా 'నో యువర్ క్యాండిడేట్..' యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు. అలాగే ఎన్నికల్లో జరిగే అవకతవకలపై సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు.

ఎన్నికల ప్రక్రియ కొనసాగనుందిలా..

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13వ తేదీన రాష్ట్రంలోని అన్ని స్థానాలతో పాటు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఇక వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి వరంగల్ కలెక్టర్, మహబూబాబాద్ స్థానానికి మహబూబాబాద్ కలెక్టర్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. అభ్యర్థుల నామినేషన్లను కూడా కలెక్టరేట్లలోనే స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

'మానుకోట'లో పొలిటికల్ హీట్

మహబూబాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగడంతో మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పొలిటికల్ హీట్ మొదలైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఖరారవడంతో వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. తమ అనుచరగణాన్ని కూడగట్టుకుని.. ప్రచార పర్వంలోకి దిగేతందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం.. మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నాటికి దాదాపు 57 రోజుల వ్యవధి ఉండగా.. ఈ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని తమ సత్తా చాటాలని అభ్యర్థులు వ్యూహరచన చేసుకుంటున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం..

మిగతా 7వ పేజీలో..

వరంగల్ అభ్యర్థులను తేల్చని కాంగ్రెస్, బీజేపీ

లోక్‌సభ ఎన్నికల నగారా మోగడంతో ఉమ్మడిజిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో వారు ప్రజాక్షేత్రంలోకి దిగారు. ఇక వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ తన అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించగా.. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులెవరే ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల కేడర్ అయోమయానికి గురవుతోంది. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటన విషయంలో కాంగ్రెస్, బీజేపీ మరికొంత సమయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. అయితే బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఆదివారం చేర్చుకుని, అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్‌లోనే 50మందికి పైగా ఆశావహులు ఉండటంతో వారిలో ఎవరిని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ ఆ పార్టీ కేడర్‌లో కనిపిస్తోంది.

వరంగల్‌లో 18,16,429మంది, మానుకోటలో 15,26,998 ఓటర్లు



వరంగల్ లోక్‌సభ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత నెల 8వ తేదీ వరకు నమోదైన మొత్తం ఓటర్లు 18,16,429మంది. వీరిలో మహిళలు 9,23,510మంది కాగా, పురుషులు 8,92,527 మంది ఉన్నారు. 392 మంది ఇతరులు ఉన్నారు. వరంగల్ ఎంపీ స్థానంలో పురుషుల కంటే మహిళలు 30,983 మంది అధికంగా ఉన్నారు. అలాగే మహబూబాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 15,26,998 మంది ఓటర్లుండగా వీరిలో మహిళలు 7,81,339 మంది, పురుషులు 7,45,554 మంది, 105 మంది ఇతరులున్నారు. ఇక్కడ కూడా మహిళ ఓటర్లు 35,785 మంది అధికంగా ఉన్నారు. కాగా, వరంగల్ పార్లమెంట్ పరిధిలో 2019కంటే ఓటర్లు భారీగా పెరిగారు. 2019లో 15,78,335మంది ఉంటే ఈసారి 18,16,429మంది ఉన్నారు. ఈ ఐదేళ్లలో 2,38,094 మంది ఓటర్లు పెరిగారు. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో 2019లో 13,36,286 మంది ఉంటే ఈసారి 15,26,998 ఓటర్లున్నారు. గత ఐదేళ్లలో 1,90,712మంది పెరిగారు. తుదిజాబితా నాటి ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా.

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
స్టేషన్‌ఘనపూర్	1,24,659	1,27,948	01	2,52,608
పాలకుర్తి	1,26,256	1,28,533	13	2,54,802
పరకాల	1,08,156	1,14,105	02	2,22,263
వరంగల్ పశ్చిమ	1,38,594	1,43,095	14	2,81,703
వరంగల్ తూర్పు	1,24,707	1,31,428	339	2,56,474
వర్ధన్నపేట	1,33,524	1,38,514	17	2,72,055
భూపాలపల్లి	1,36,631	1,39,887	06	2,76,524
మొత్తం	8,92,527	9,23,510	392	18,16,429

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,08,931	1,13,165	07	2,22,103
మహబూబాబాద్	1,26,290	1,31,449	47	2,57,786
నర్సంపేట	1,14,891	1,20,104	09	2,35,004
ములుగు	1,13,413	1,18,935	26	2,32,374
పినపాక	99,608	1,03,525	05	2,03,138
ఇల్లందు	1,09,632	1,14,818	04	2,24,454
భద్రాచలం	72,789	79,343	07	1,52,139
మొత్తం	7,45,554	7,81,339	105	15,26,998

ఐదేళ్లలో పెరిగిన ఓటర్లు..

పార్లమెంట్ స్థానం	2019	2024	పెరిగిన ఓట్లు
వరంగల్	15,78,335	18,16,429	2,38,094
మహబూబాబాద్	13,36,286	15,26,998	1,90,712



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఎంపిక

అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు

పోచమ్మమైదాన్, మార్చి 16:జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) స్కీంలో వివిధ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో పలువురు అభ్యర్థులను శనివారం ఎంపిక చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి నేతృత్వంలో మెరిట్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 32 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 17స్టాఫ్ నర్సు పోస్టులకు మినహా మిగిలిన పోస్టులకు అడిషనల్ కలెక్టర్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ గోపాల్‌లు ఇంటర్వ్యూలు పూర్తి చేశారు. మెరిట్ ఆధారంగా వన్ ఈస్ట్ త్రీ చొప్పున అభ్యర్థులకు సమాచారం అందించి 15మంది ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. 17ఎన్‌సీడీ స్టాఫ్ నర్సు పోస్టులకు 1,520 దరఖాస్తులు రావడంతో స్ర్కూటీని పూర్తి కాలేదని, అందుకే ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

హుటాహుటిన ఇంటర్వ్యూలు..

మొత్తం 32పోస్టులకు 2,234 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను స్ర్కూటిని చేసి అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్టును కార్యాలయంలో, అఫిషియల్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఈనెల 12 నుంచి 13వరకు దరఖాస్తుల సవరణకు అభ్యంతరాల స్వీకరణ జరిగింది. అభ్యంతరాల స్వీకరణ ముగిసిన రెండు రోజుల వ్యవధిలోనే మెరిట్ లిస్టును ఏర్పాటు చేసి, అర్హులైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి ఇంటర్వ్యూకు ఆహ్వానించారు.

అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు..

ఉద్యోగులనియామకాలలో అవకతవకలు జరిగినట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ప్రొవిజనల్ లిస్టులో అనేక మంది అభ్యర్థుల వివరాలు, మార్కుల అంశాలు తప్పుగా నమోదయ్యాయని, వీటిపై వచ్చిన అభ్యంతరాలు ఏమైయ్యాయని ప్రశ్నిస్తున్నారు. హుటాహుటిన ఇంటర్వ్యూలు నిర్వహించడం వెనక ఉన్న అంతర్యమేమిటని మండిపడుతున్నారు. డీఎంహెచ్ కార్యాలయంలో ఓ ఉద్యోగి ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. బాధితులు డీఎంహెచ్‌వో దృష్టికి విషయం తీసుకెళ్ళినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం సెక్షన్ మార్పు చేసినట్లు తెలుస్తుంది. ఎన్‌హెచ్‌ఎం స్కీంలో వెలువడ్డ ఉద్యోగాల నోటిఫికేషన్‌ను పలువురు ఆసరాగా చేసుకొని నిరుద్యోగుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బీఆర్‌ఎస్‌కు అరూరి రాజీనామా



రాంనగర్, మార్చి 16: బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పార్టీకి రాజీనామా చేశారు. శనివారం రాజీనామా లేఖను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపారు. పార్టీలో అవకాశాలు కల్పించిన కేసీఆర్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ మంత్రి హరీష్‌రావు అరూరి ధన్యవాదాలు తెలిపారు. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, అరూరి రమేశ్ 2012లో బీఆర్‌ఎస్‌లో చేరి 2014, 2018 ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

గత నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడోసారి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన అరూరి రమేశ్ కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి చెందారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయాలని సిద్ధమైనప్పటికీ పార్టీ నుంచి ప్రతి కూల సంకేతాలు రావడంతో మనస్తాపంతో రాజీనామా చేశారు.

నేడు బీజేపీలోకి..

బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన అరూరి రమేశ్ ఆదివారం బీజేపీలో చేరనున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరనున్నారు. బీజేపీలో చేరనున్న అరూరిని వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ సభ్యత్వంతోపాటు ఎంపీ అభ్యర్థిగా బీఫామ్ ఇచ్చే అవకాశాలున్నట్లు తెలిసింది. మొత్తంగా వారంరోజులుగా జరుగుతున్న అరూరి ఎపిసోడ్‌కు ఆదివారం తెరపడే అవకాశం ఉంది.

శనివారం ఉష్ణోగ్రతలు
గరిష్టం : 36.0°C
కనిష్టం : 23.5°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : ఆదివారం సా : 6.32 గం..
సహర్ : సోమవారం ఉ : 5.00 గం..

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీ దయాకర్

హనుమకొండ సిటీ, మార్చి 16: వరంగల్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇటీవలే కొద్ది రోజులుగా చేరికల ప్రస్థానం కొనసాగుతోంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లతోపాటు మరి కొందరు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా.. శనివారం బీఆర్‌ఎస్‌కు చెందిన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్ కండువాను ధరించారు. మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. శనివారం మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని కలిశారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్ కండువాను కప్పి దయాకర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఆశావహుడు జన్ను పరంజ్యోతి, నవీన్‌రాజ్, కేడల పద్మ పాల్గొన్నారు.



ఎంపీ దయాకర్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, చిత్రంలో మంత్రి కొండా సురేఖ

ఎమ్మెల్యే నాయిని ఆధ్వర్యంలో..

పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, ఆమె భర్త భాస్కర్, 61, 54 డివిజన్ కార్పొరేటర్లు ఎలిగంటి రాములు, గుంటి రజిత కాంగ్రెస్ గూటికి చేరారు. మాజీ కార్పొరేటర్ మర్రి జనార్దన్ పటేల్ కూడా రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరారు. ఇప్పటికే ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా, తాజాగా ఇద్దరి కార్పొరేటర్ల చేరికతో ఈ సంఖ్య 8కి చేరింది.

కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆందోళనలు

వరంగల్ సిటీ, మార్చి 16: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు బీఆర్‌ఎస్ నాయకులు నల్లబాడ్జీలతో నిరసనలు, రాస్తారోకోలు, ప్రధాని మోదీదిష్టి బొమ్మల దహనం చేశారు. వరంగల్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ రోడ్డు బైఠాయించేప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. వర్ధన్నపేటలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పూల్లు కుమరస్వామి ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆందోళనలో పాల్గొన్నారు. నర్సంపేట పట్టణంలో మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మనుదహనం చేశారు. నల్లబెల్లిలో బస్టాండ్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీనోతు సారంగపాణి ఆధ్వర్యంలో, ఖానాపురం మండల కేంద్రంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో ప్రధాని దిష్టబొమ్మలను దహనం చేశారు. దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. నెక్కొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మండల అధ్యక్షుడు సంగని సూరయ్య ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.



వరంగల్, వర్ధన్నపేటలో జరిగిన ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, మంత్రి దయాకర్‌రావు

అరెస్టు వెనుక సీఎం హస్తం: ఎర్రబెల్లి

వర్ధన్నపేట రూరల్: ఎమ్మెల్సీ కవిత అరెస్టు వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు, సీఎం రేవంత్‌రెడ్డి హస్తం ఉందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. వర్ధన్నపేటలో కవిత అరెస్టును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధా ని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్ని బీఆర్‌ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు ఎవరిని ఇబ్బం ది పెట్టలేదన్నారు ఇప్పుడు బీఆర్‌ఎస్ నాయకులపై కేసులుపెట్టి భయబ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు.


ప్రపంచానికి నూతన ఆవిష్కరణలు అందించాలి

ఎస్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే

హసన్‌పర్తి, మార్చి 16 : యువ ఇంజనీర్లు ప్రపంచానికి నూతన ఆవిష్కరణలను అందించాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే అన్నారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్దగల ఎస్సార్ యూనివర్సిటీలో శనివారం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ ఇంజనీర్లు సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను పరిష్కరించే వారిగా ఉండి, నూతన ఆవిష్కరణలకు తోడ్పడాలన్నారు. యూనివర్సిటీ కల్పించే సదుపాయాలతో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లర్నింగ్, డ్రోన్స్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతతో ప్రపంచం ముందుకు వెళుతుందన్నారు. భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మార్గదర్శిగా నిలిచిందన్నారు. అందుకు నిదర్శనం చంద్రయాన్, ఆదిత్య మిషన్, థోరియం రియాక్టర్లు, వందేభారత్ రైళ్లు నిదర్శనమన్నారు. ఎన్ఈటీఎఫ్, పీఎంకేవీవై, ఎన్ఏడీసీ, ఎన్ఎస్ఎం వంటివి ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక నైపుణ్యాలు అందుతున్నాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి మాట్లాడుతూ.. 45ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. 2002లో ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి, ఎన్ఏఏసీ, ఎన్‌బీఏ, యూజీసీ అక్రిడియేషన్స్ పొంది, 2023లో జాతీయ స్థాయిలో 98వ స్థానం సాధించి, నూతన ఆవిష్కరణలతో జాతీయ స్థాయిలో అటల్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ చిత్రం ద్వారా ఆస్కార్ అవార్డు రావడం, ఎస్సార్ వర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ రావడం జీవితంలో మరిచిపోలేనివన్నారు. చదువు నేర్చుకున్న గురువుతోనే డాక్టరేట్ అందుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం చంద్రబోస్‌కు గౌరవ డాక్టరేట్ పట్టాను, విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్ ఎనగందుల మధుకర్‌రెడ్డి, వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, కన్వొకేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ సీవీగురురావు, డీన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ సహస్ర బుద్ధే







లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

▸▸ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే ▸▸ ఏసీబీ, హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభం

వరంగల్ లీగల్, మార్చి 16 : లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, ఇందులో వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులు ముందున్నాయని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాథే ప్రశంసించారు. శనివారం వరంగల్, హనుమకొండ కోర్టుల సముదాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన అవినీతి నిరోధక వరంగల్ ప్రత్యేక కోర్టు (ఏసీబీ), హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఈ-సేవా కేంద్రం, రికార్డుల డిజిటలైజేషన్ కేంద్రాన్ని జస్టిస్ ఆలోక్ అరాథే ప్రారంభించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 3,43,182 కేసులు పరిష్కారంకాగా, వరంగల్ కోర్టు పరిధిలో 4713, హనుమకొండ జిల్లా కోర్టు పరిధిలో 3,501 కేసులు పరిష్కారమయ్యాన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఈ రెండు కోర్టుల పరిధిలో అత్యధికంగా కేసులు పరిష్కారం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసుల సత్వర కృషి చేసినందుకు జ్యుడీషియల్ సిబ్బందిని ప్రధాన న్యాయమూర్తి అభినందించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసికట్టుగా కృషి చేసినందు వల్లనే ఇది సాధ్యమైందన్నారు.



హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే

న్యాయవ్యవస్థ అంకితభావంతో అర్థవం తమైన పాత్రపోషించడం ద్వారానే సమాజంలో వెలుగులను నింపగలుగు తామని జస్టిస్ అలోక్ అరాథే అన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయమూ ర్తులు, న్యాయవాదుల పరస్పర సహకారం కీలక మైందన్నారు. ఉభయులు పరస్పర సహకారం, సమన్వయంతోనే కేసులు సత్వరం పరిష్కారం అవుతా యన్నారు. వరంగల్ కోర్టు సముదాయంలో శనివారం ప్రారంభమైన ఈ-సేవా కేంద్రం ఎంతో ఉపయుక్తమైందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద తెలంగాణ రాష్ట్రంలో మొదటి సారి దీనిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీని కొనసాగిం పుగా ఈనెల 23న నల్లగొండ జిల్లాలో కూడా ఈ-సేవా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ-సేవా కేంద్రాన్ని న్యాయవాదులు సద్విని యోగం చేసుకోవడం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ-సేవా కేంద్రం ద్వారా హైకోర్టు వరకు రావలసిన అవసరం లేకుండా ఇక్కడి నుంచే కేసులను దాఖలు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించే అవకాశం ఉందన్నారు. కోర్టు ప్రాంగణంలో కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన డిజిటల్ కేంద్రం సౌకర్యాన్ని ప్రస్తావిస్తూ కేసులకు సంబంధించిన దస్తావేజులు కాలక్రమంలో దెబ్బతింటున్న దృష్ట్యా వాటిని శాశ్వతంగా భద్రపరిచేందుకు డిజిలైజేషన్ ఎంతో ఉపయోగపడుతుందని, ఈ సౌకర్యం వరంగల్ జిల్లా కోర్టు సముదాయంలో అందుబాటులోకి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. దీనిని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ అలోక్ అరాథే కోరారు. బార్ అసోసియేషన్ల ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన జిల్లా కోర్టు సముదాయంలోని సమస్యల ను, డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జిల్లా పోర్టు పోలియో జడ్జి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ జె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు వర్క్‌షాపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిమెంట్ల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఐదుకోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, హనుమకొండ, వరంగల్ జిల్లాల వ్యాప్తంగా కూడా 30వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు చిత్తశుద్ధితో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వరంగల్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హైకోర్టు మరో జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కోర్టు సముదాయంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ-సేవా కేంద్రం ద్వా రా న్యాయవాదులు తమ కేసుల దస్తావేజులను ఉచితంగా స్కాన్ చేసుకోవచ్చునని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

తొలుత హనుమకొండ జిల్లా ప్రధాన జడ్జి ఎం.క్రిష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేశారు. వరంగల్, హనుమకొండ కోర్టు సముదాయం ప్రాముఖ్యత, ఓరుగల్లు జిల్లా చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. వరంగల్ జిల్లా జడ్జి కోక రాధాదేవి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తొలుత జస్టిస్ అరాధే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వై.శ్యాంసుందర్ రెడ్డి, ఈ.అనంద్ మోహన్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగరావు, ఉభయ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆహూతులతో కోర్టు ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమం ఆద్యంతం అహ్లాదకర వాతావరణంలో జరిగింది.

అంతకుముందు పది కోర్టుల భవన సముదాయం ముందుగల కాకతీయ కళాతోరణం ఎదుట జిల్లా న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధేతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. సమావేశం అనంతరం బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సత్కరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాధే శనివారం రాత్రి ఇక్కడే బస చేస్తారు. ఆదివారం హనుమకొండలోని వేయి స్తంభాలగుడి, భద్రకాళి దేవాలయం, ములుగులోని రామప్ప గుడిని సందర్శిస్తారు. కాగా, ఆదివారం నర్సంపేటలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా పోర్టు పోలియో జడ్జి జిస్టస్ కె.లక్ష్మణ్ ప్రారంభిస్తారు.

లోక్ అదాలత్‌లో 8,214 కేసుల పరిష్కారం

హనుమకొండ జిల్లాలో 3,501, వరంగల్ జిల్లాలో 4,713

వరంగల్ లీగల్, మార్చి 16 : జాతీయ రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 8,214 కేసులను పరిష్కరించినట్టు వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు కె.రాధాదేవి, ఎం.క్రిష్ణమూర్తి తెలిపారు. వరంగల్ జిల్లాలో తొమ్మిది బెంచీలు ఏర్పాటుచేసి 49 సివిల్ కేసులు, 28 రోడ్డు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.కోటి 40లక్షల 92వేల 176 నష్టపరిహారం చెల్లించారు. 4,164 క్రిమినల్ కేసులు, 5 ప్రీలిటిగేషన్ కేసులు, 13 బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలో 39 సివిల్ కేసులు, 24 మోటారు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.1,13,75,000 నష్టపరిహారం అందించినట్టు న్యాయమూర్తులు తెలిపారు. 3455 క్రిమినల్ కేసులు, 7 బీఎస్ఎన్ఎల్ కేసులు కూడా పరిష్కరించారు.

అంతకుముందు ఉదయం 10.30 గంటలకు న్యాయసేవా సంస్థ భవన్‌లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు ప్రారంభించారు. హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉపేందర్ రావు, వరంగల్ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి సాయికుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు జిల్లా జడ్జిలు, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఎలుకుర్తి ఆనంద్ మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు, వివిధ బ్యాంకు ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా జడ్జి రాధాదేవి

'మానుకోట'లో పొలిటికల్ హీట్

(5వ పేజీ తరువాయి)

ములుగు మొదలుకుని నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం వరకు మొత్తం ఏడు ఏజెన్సీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే ప్రచార వ్యవధికాలానికి ఒకట్రెండురోజుల ముందే ఆయా నియోజకవర్గాలను చుట్టి రావడంతో పాటు అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేసేందుకు నేతలు సమాయత్తమవుతున్నారు. తమ పార్టీల అగ్రనేతల సభలు, రోడ్‌షోల నిర్వహణకు కసరత్తు చేసుకుంటున్నారు. ముందస్తుగానే అసెంబ్లీ నియోజవర్గాల వారీగా పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. తొలుత పార్టీ టికెట్ ఖరారు చేసుకున్న సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ మాలోతు కవిత తన తండ్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సొంత నియోజకవర్గంలోని మరిపెడ నుంచి ప్రచారం ఆరంభించారు. కాంగ్రెస్ రెండవ జాబితాలో చోటు దక్కించుకున్న కేంద్రమాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ రెండ్రోజుల కిందట మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధి భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమానికి హాజరై తన ప్రచార పర్వానికి అక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. తాజాగా బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి గూడూరు మీదుగా డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో శనివారం పర్యటించారు. అయితే ఈ ముగ్గురు పార్లమెంట్ నియోజకవర్గానికి పాత ముఖాలే కావడంతో తమతమ హయాంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోవడంతో పాటు పరిచయాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

కోడ్‌తో సామాన్యులకు సంకటమే..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే ఎన్నికల కోడ్ శనివారం నుంచే అమల్లోకి రావడం, సుమారు రెండునెలల పాటు ఈ కోడ్ అమల్లో ఉండనుండటంతో సామాన్యులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ నగదుతో వెళ్లాల్సి వస్తే వాటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపాలి. లేదంటే అధికారులు ఆ నగదును సీజ్ చేస్తారు. అయితే ప్రస్తుతం వివాహ శుభకార్యాల సమయం కావడం, ముఖ్యంగా ఏప్రిల్ 26 వరకు ఎక్కువ ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలకు అవసరమైన బంగారం, దుస్తులు, ఇతర వస్తువులు ఖరీదు చేసేందుకు వధూవరుల బంధువర్గాలు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో అధిక మొత్తంలో నగదును తీసుకువెళ్లాల్సి ఉంటుంది. నగదు తీసుకువెళ్లకుండా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసే అవకాశాలున్నప్పటికీ ఆన్‌లైన్ విధానంలో చెల్లించే వాటి దుకాణాల వారు ట్రాన్సాక్షన్ చార్జీల పేరుతో వసూలు చేస్తుండటంతో చాలా మంది డబ్బు రూపంలోనే ఇచ్చేందుకు ఆసక్తి చూపుతుంటారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారికి డిజిటల్ చెల్లింపులపై అంతగా అవగాహన లేని వారు డబ్బును తీసుకెళుతుంటారు. అలాంటి వారికి ఎన్నికల కోడ్ తనిఖీలు కొంత సంకటంగా మారే అవకాశాలున్నాయి.

అధునాతన పద్ధతిలో
గర్భస్థ శిశువు తొలగింపు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మార్చి 16 : ఓ తల్లి గర్భంలో ముగ్గురు శిశువులు ఒకే అమ్నిమాటిక్ పొరతో కప్పబడి ఉండగా అత్యంత అధునాతన పద్ధతిలో ఒక శిశువును తొలగించినట్లు హనుమకొండలోని ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ శిరీష శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. వరంగల్‌లో మొట్టమొదటి సారిగా ఈవిధానంలో చికిత్స అందించామన్నారు. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన 15 వారాల గర్భిణి గుగులోతు సంతోష (29) చికిత్స నిమిత్తం తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఈమె గర్భంలో ఒకే పొర కింద ముగ్గురు శిశువులున్నట్లు గుర్తించి పొటాషియం క్లోరైడ్ ఇంజనక్షన్‌తో ఒక శిశువును తొలగించే అవకాశం ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. కొన్ని ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల ముగ్గురు శిశువులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కష్టమైన కేసులో ముంబై నుంచి ఓ ప్రత్యేకమైన లేజర్ మిషన్ తెప్పించి క్లిష్టమైన అరుదైన శస్త్రచికిత్సను హనుమకొండలో నిర్వహించామన్నారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి కేసులు ఒకటి రెండు మాత్రమే జరిగాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 75వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు కానుండగా, హనుమకొండలో మాత్రం రూ.35వేలకే చికిత్స అందించామని తెలిపారు. ప్రస్తుతం గర్భిణితో పాటు ఇద్దరు శిశువులు క్షేమంగా ఉన్నట్లు పీటల్ మెడిసిన్ వైద్యురాలు డాక్టర్ శిరీష వెల్లడించారు.



భద్రకాళి సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

వరంగల్ కల్చరల్, మార్చి 16: భద్రకాళీ అమ్మవారిని శనివారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ ఆరాదే దంపతులు దర్శించుకున్నారు. ప్రధాన న్యాయమూర్తితోపాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ రాజేశ్వర్ రావు, రిజిస్ట్రార్లు నందికొండ నర్సింగరావు,ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ కె.రాధాదేవి, జస్టిస్ ఎం.కృష్ణమూర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి ఆహ్వానిస్తున్న రేవూరి

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు: రేవూరి

గీసుగొండ, మార్చి 16: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజాప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మొగిలిచర్ల, గొర్రెకుంట, గరీబ్‌నగర్, కీర్తినగర్, జాన్‌పాక, ఆదర్శనగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. జాన్‌పాక, కీర్తినగర్ దర్గాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలని కప్పి రేవూరి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ జానీ, కొండేటి కొమురారెడ్డి, దుపాకి సంతోష్, పోలెపాక సుమన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన యుగేందర్ గౌడ్

కరీమాబాద్, మార్చి 16: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీన గడ్డం యుగేందర్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ దయాకర్‌తోపాటు, బల్నే సురేష్, గడ్డం యుగేందర్ గౌడ్‌లు మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికల విషయంలో గోపాల నవీన్‌రాజ్ కీలక పాత్ర పోషించినట్లు పార్టీలో చేరిన పలువురు నాయకులు తెలిపారు.

బంగారు తల్లికి రాజగోపురాలు

• తల్లి సేవల కోసం మాడ వీధుల నిర్మాణం • రూ. 30 కోట్ల కేటాయింపు పనులు ప్రారంభం • తెలుగు రాష్ట్రాల్లోనే 2వ మాడ వీధుల దేవాలయం

వరంగల్ కల్చరల్, మార్చి16: ఓరుగల్లులోని భద్రకాళి ఆలయాన్ని రూ.30కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు అధికారులు, అర్చకులు శనివారం తొలి పూజ చేశారు. భక్తులకు దర్శనానికి, ఉత్సవాల సేవలు నిర్వహించడానికి నాలుగు మాడ వీధులను నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇటీవలనే నిర్మాణానికి పూర్తి అనుమతులను రావడంతో నాలుగు మాడ వీధులు, నాలుగు రాజగోపురాలను నిర్మించడానికి ప్రభుత్వం రూ.30కోట్లను కేటాయించింది. వీటి నిర్మాణాల పనులను ఆరు మాసాల్లో నాలుగు రాజగోపురాలను, నాలుగు మాడ వీధులను నిర్మాణం పూర్తి చేసి అమ్మవారికి అత్యంత వైభవంగా జరిగే దేవీ నవరాత్రోత్సవాల్లో భక్తులకు అందుబాటులోకి తెచ్చేలు పనులను ప్రారంభించారు.

నాలుగు రాజగోపురాలు.. మాడవీధులు

ఆలయానికి నాలుగు రాజగోపురాలను ఆగమశాస్త్ర ప్రకారం నిర్మించనున్నారు. దీంతో భక్తులు దర్శనానికి ఈ ద్వారం గుండా వెళ్తారు. ఇందులో తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తరం నాలుగు దిక్కుల నాలుగు రాజగోపురాలు. ఇందులో ప్రధానంగా అమ్మవారి ఆలయానికి ఎదురుగా 9 అంతస్థుల రాజగోపురాన్ని నిర్మాణం చేస్తున్నారు. అలాగే అమ్మవారికి జరిగే ఉత్సవాల్లో ప్రధాన వేడుకల్లో ఉత్సవ మూర్తులను ఊరేగించడానికి భక్తులు అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి నాలుగు మాడ వీధులను నిర్మాణం చేయాలని నిర్ణయించి అందుకు నిర్మాణం పనులను ప్రారంభించారు. తూర్పులో 60 ఫీట్లు, పశ్చిమలో 60 ఫీట్లు, దక్షిణంలో 60 ఫీట్లు ఉండగా ఉత్తరంలో 400 ఫీట్ల వేడల్పుతో మాడ వీధులను నిర్మాణం చేస్తున్నారు. కాకతీయుల శిల్ప కళా నైపుణ్యంతో రాతి శిలలతో కట్టిన ఆలయాల మాదిరిగానే ఈ వీధులను , రాజగోపురాలను నిర్మించనున్నారు. మాడ వీధులు, రాజగోపురాలను దేవాదాయ శాఖకు చెందిన ప్రధాన స్థపతి వల్లీ నాయగంతోపాటు తమిళనాడుకు చెందిన మరొక స్థపతి జయంద్ర స్థపతి పర్యవేక్షణలో ప్రణాళిక రూపొందించారు.



శ్రీభద్రకాళి అమ్మవారు

ఇందులో వరంగల్‌కు చెందిన నిట్ కళాశాల సీనియర్ ఇంజనీర్లు కూడా ప్లాన్ రూపకల్పనలో విశేష కృషి చేశారు.

ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి..

రామప్ప, వేయిస్తంభాల దేవాలయాలు యునెస్కో ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందడంతో వరంగల్‌కు పర్యాటకులు భక్తుల తాకిడి పెరిగింది. ఇందుకు అనుగుణంగా ప్రతీ శుక్ర, శని, ఆదివారాల్లో 10 వేల మంది భక్తులు రావడం జరుగుతోంది. గతంలో ఈ రోజుల్లో మూడు వేల మంది భక్తులు వచ్చేవారు. దీనితో ఆలయ పరిసర ప్రాంతాల స్థల ప్రభావం సరిపోవడం లేదు. పెరుగుతున్న భక్తుల రద్దీ భక్తుల తాకిడీని గుర్తించి ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేసే విధంగా నాలుగు మాడ వీధులు, నాలుగు రాజగోపురాలు అవసరమని ఆంధ్రజ్యోతి నాలుగు సంవత్సరాల క్రితమే చెప్పింది. అప్పుడు చెప్పిన సూచనను ఆలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం గుర్తించి వీటి నిర్మాణానికి ప్రతిపాదనలను పరిశీలించి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు.

మాడ వీధుల నిర్మాణం పనులు ప్రారంభం

● వాస్తు మండల ఆరాధన శిలన్యాస పూజ ● 'కుడా' ఆలయ అధికారులచే పూజలు

వరంగల్ కల్చరల్, మార్చి 16: ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న శ్రీభద్రకాళి అమ్మవారి దేవాలయానికి మాడ వీధుల నిర్మాణం, రాజగోపురాల పనులను శనివారం పండితుల సూచనల మేరకు అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, వాస్తు మండల ఆరాధన జరిపి కాతాపూజనం శిలన్యాసనం జరిపి పనులు ప్రారంభించారు. 'కుడా' పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూజ చేసి పనులు ప్రారంభించారు. భద్రకాళి శేషు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో హైదరాబాద్ సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ కమిషనర్ పలు ముఖ్య శాఖల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయబడిందని మాడ వీధుల నిర్మాణానికి ఉన్న చిక్కులన్నీ తొలగి పోయాయన్నారు. దీంతో వెంటనే పనులు ప్రారంభించాల్సిందిగా మంత్రులు కొండా సురేఖ, శ్రీనివాస్‌రెడ్డిలు కుడా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.



మాడ వీధుల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అధికారులు, అర్చకులు

ఈ క్రమంలో శనివారం పనుల ప్రారంభ పూజలు జరిపినట్లు పేర్కొన్నారు. వాస్తవంగా పశ్చిమ ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పనులకు ప్రారంభించాల్సి ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ వస్తే పనులు ప్రారంభించడానికి ఆలస్యమవుతుందన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులచే ప్రారంభించాల్సిందిగా మంత్రి, ఎమ్మెల్యేలు అధికారులకు ఆదేశించారు. భక్తుల జయ జయ ధ్వనాల మధ్య పనులు ప్రారంభమయ్యాయి.

అధికారులు సమిష్టి కృషితో పనిచేయాలి

• గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే • బల్దియా అధికారులతో సమీక్ష సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16: గ్రేటర్ వరంగల్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు సేవలందించేందుకు సంబంధిత అధికారులు సమిష్టి కృషితో పని చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో శనివారం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం, ఇంజనీరింగ్, మంచినీటి సరఫరా, పట్టణ ప్రణాళిక అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా ప్రణాళికా బద్ధంగా విడుదల చేసి నీరు అందని ప్రాంతాల్లో ట్యాంకుల ద్వారా ప్రజలకు నీటిని అందించాలని చెప్పారు. లీకేజీలను ఎప్పటికప్పుడు కట్టడి చేయడంతో పాటు పైప్‌లైన్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. ప్రతీరోజు అన్ని డివిజన్‌లలో పారిశుధ్య పనులు నిర్వహించాలని అన్నారు. ఇంటింటి నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా తడి, పొడి చెత్త సేకరణతో పాటు డంపింగ్ యార్డ్‌లకు చెత్తను తరలించాలన్నారు.

ఈ యేడు వార్షిక లెక్కలకు పక్షం రోజుల మాత్రమే ఉన్నందున పన్నుల సేకరణపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. 100 శాతం పన్నులు చెల్లించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఆస్తి పన్నుతో పాటు నీటి, ట్రేడ్ లైసెన్స్ పన్నులు కూడా త్వరితగతిన సేకరించాలన్నారు. త్వరలో విభాగాల వారిగా అధికారులతో కూలంకషంగా చర్చిస్తామని, అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈ కృష్ణారావు, సీఎం హెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఉప కమిషనర్ రవీందర్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీసీపీ ప్రకాశ్ రెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16: అన్ని రంగాల్లో మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని మేయర్ గుండు సుధారాణి మహిళలకు సూచించారు. శనివారం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో వరంగల్ నగర పాలక సంస్థ, మెప్మా సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరైన ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆకాశాన్నితాకే తత్వం, గుణం మహిళలకే ఉంటుందని చెప్పారు. గతంలో మహిళా దినోత్సవం సందర్భంగా హెల్త్ క్యాంపులు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. మహిళలకు దశలవారిగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళా సదస్సులో వరంగల్ బల్దియాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి అనేక వరాలు కురిపించారని గుర్తు చేశారు. ఇంకా సంక్షేమ పథకాల అమలులో స్వయం సహాయక మహిళా బృందాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్‌హెచ్‌జీ బృందాల సభ్యురాళ్లు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. మెప్మా విభాగం తరపున అధికారులు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టినా అధికారులు తప్పకుండా అమలు చేయాలన్నారు.

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. మహిళా దినోత్సవ ప్రధాన ఇతివృత్తం 'ఇన్వెస్ట్ ఇన్ ఉమెన్ ఆక్సిలరేట్ ప్రోగ్రెస్ ' అన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ఇద్దరు కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్‌లతో పాటు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్‌గా తాను విధుల్లో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వయం సహాయక మహిళా బృందాలు పొదుపు పాటించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు.



క్రీడాపోటీలలో పాల్గొన్న మహిళా కార్పొరేటర్లు

అనంతరం రెండు రోజులు పాటు మహిళా కార్పొరేటర్లకు, మహిళా ఉద్యోగులకు నిర్వహించిన వివిధ క్రీడాంశాలలో విజేతలుగా నిలిచిన వారికి మేయర్, కమిషనర్‌ల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, తూర్పాటి సులోచన, దివ్యారాణి, జక్కుల రజిత, జన్ను షిబారాణి, గుజ్జుల వసంత, ఓరుగంటి అరుణకుమారి, గుండు చందన, బస్వరాజు శిరీష, రామ తేజస్వి, బోగి సువర్ణ, మానస, ఈదురు అరుణ, జలగం అనిత జేఎవో సరిత పాల్గొన్నారు.

శివభక్త మార్కండేయ దేవాలయం ప్రారంభం



రవికుమార్, నరేందర్‌లను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఖిలావరంగల్, మార్చి 16: శివనగర్‌లో శ్రీ శివభక్త మార్కండేయ దేవాలయం, విగ్రహ ప్రతిష్ఠాపణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. శనివారం పూజా కార్యక్రమాలను చేపట్టారు. పద్మశాలి పరస్పర సహాయక సహకార పరపతి సంఘం, శివనగర్, అండర్ బ్రిడ్జి వారి సహకారంతో దేవాలయాన్ని నిర్మించారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్‌లు ఆలయాన్ని దర్శించుకున్నారు. వారికి కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వొడ్నాల మల్లయ్య, కన్వనర్ వొడ్నాల సదానందం, సభ్యులు మాచర్ల వెంకటేశ్వర్లు, బుదారపు భాస్కర్, ఊరుగొండ సారంగపాణి , రాంపెల్లి చంద్రమౌళి, పాశికంటి రాజేంద్రప్రసాద్, పాశికంటి రాజేశ్వర్‌రావు, పాశికంటి రవి, పిట్ట భాస్కర్ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనలలో యువతుల మిస్సింగ్

కరీమాబాద్, మార్చి16: ఓ యువతి కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం శివనగర్‌కు చెందిన ఓరుగంటి శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య క్యాంటిన్‌లో పనిచేస్తుంది. వీరి రక్షిత(20) శనివారం భార్య క్యాంటిన్ పని ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి కూతురు కనిపించకపోయే సరికి చుట్టు పక్కల, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఫలితం కనిపంచలేదు. దీంతో తన కూతురు కనిపించడం లేదంటూ శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు.

● పుల్లయ్యకుంటలో..

తన సోదరి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిల్స్‌కాలనీ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం. కంజర్ల అఖిల(19)ఆర్టీవో కార్యాలయం వెనకాల ఉన్న పుల్లయ్యకుంటలో నివాసం ఉంటూ, కేసముద్రంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈనెల 14న పరీక్షలు పూర్తి కావడంతో కేసముద్రం నుంచి ఇంటికి వచ్చింది. 15న మధ్యాహ్నం కూరగాయలు తేవడానికి కిరాణం షాపునకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె సోదరి అఖిల ఫిర్యాదుతో కేసు నమోదుచేశారు.

నేరస్తులతో కఠినంగా వ్యవహరించాలి

వరంగల్ చౌరస్తా, మార్చి 16: నేరస్తులతో కఠినంగా వ్యవహరించాలని, ఫిర్యాదుదారులు బాధితులతో మర్యాదగా మాట్లాడాలని, పారదర్శంగా వ్యవహరించి పోలీసులపై నమ్మకాన్ని పెంచాలని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అన్నారు. శనివారం ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ సిబ్బందితో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున అందరు కష్టపడి పని చేయాలని, సిబ్బంది విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు, దొంగతనాలు జరుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ మచ్చ శివకుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

కవిత అరెస్టు అక్రమం: బీఆర్ఎస్

వరంగల్ సిటీ, మార్చి 16: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమమని, రాబోయే ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే బీజేపీ చిల్లర రాజకీయలు చేస్తోందని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ గందె కల్పన అధ్యక్షతన వరంగల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్పొరేటర్ మరుపల్ల రవిని బలవంతంగా తీసుకెళ్లారు. కొద్దిసేపు నల్లబాడ్జీలతో నిరసన తెలిపారు. నరేందర్ మాట్లాడుతూ.. రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేకనే బీజేపీ కవితను అరెస్ట్ చేసిందన్నారు. దానికి బీజేపీ రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటుందన్నారు.



వరంగల్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించే ప్రయత్నాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

కవితను అరెస్ట్ చేయవద్దని కోర్టు చెప్పినా కక్షపూరితంగా అరెస్ట్ చేయించిందన్నారు. పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదని, 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను వాటిని అమలు చేసేదాక వదిలిపెట్టమన్నారు. కాంగ్రెస్, బీజేపీల కుట్రలను ప్రజలముందు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానాషమీమ్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, గందె కల్పన నవీన్, సిద్దం రాజు, భోగి సువర్ణ సురేష్ మాజీ మార్కెట్ చైర్మన్ టి. రమేష్‌బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, వొగిలిశెట్టి అనిల్, అజయ్, కొడారి రవి పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్

పాఠశాల ఎదుట ఆందోళన.. కేసు నమోదు

ఏకశిలానగర్, మార్చి 16 : అకారణంగా విద్యార్థి టీచర్ చితకబాదిన ఘటన నగరంలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల కథనం ప్రకారం.. ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన బాలిక స్థానిక ప్రైవేటు స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. శుక్రవారం పాఠశాలకు వెళ్లగా పీఈటీ నరేష్ బాలికను వీపుపై కొట్టారు. పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. వీపు కమిలిపోవడంతో పాఠశాల వద్దకు వచ్చిన తల్లిదండ్రులు 'చిన్న పిల్ల అని చూడకుండా ఇలా కొట్టడమేంటి' అని ప్రశ్నించారు. అనంతరం మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం కుటుంబ సభ్యులు, వామపక్ష విద్యార్థి సంఘాలు పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగారు.

ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, జిల్లా కార్యదర్శి లాదెళ్ళ శరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ జిల్లా అధ్యక్షులు చుక్కా ప్రశాంత్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఘటనపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈవో విజయ్‌కు వినతి పత్రం అందించారు. దీంతో ఘటనపై ఎంఈవో విజయ్ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. మిల్స్‌కాలనీ సీఐ మలయ్య పాఠశాలకు చేరుకొని ఆందోళనకు దిగిన వారికి నచ్చజెప్పారు. కాగా పీఈటీ నరేష్ పరారీలో ఉన్నాడని తెలిసింది.



వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పోచమ్మమైదాన్, మార్చి 16: ఎంహెచ్‌నగర్-2 గుడిసెవాసులకు స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి మహ్మద్ బషీర్‌అహ్మద్ అన్నారు. వరంగల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం సీపీఎం కాశిబుగ్గ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుడిసెవాసులను ఆదుకోవాలని, ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు మహ్మద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, ప్రభాకర్, నర్సింహులు, కుమార్, ఎస్టీ నసీర్, విజయ్, మధు, వెంకటేశ్వర్లు, స్రవంతి, హారిక, రమాదేవి పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రవిందర్

జాతరను భక్తిపూర్వకంగా జరుపుకోవాలి

ఈస్ట్‌జోన్ డీసీపీ రవిందర్

గీసుగొండ, మార్చి 16: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరను భక్తి పూర్వకంగా జరుపుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రవిందర్ సూచించారు. ఆలయ ప్రాంగణంలో బందోబస్త్, చేపట్టిన ముందస్తు చర్యలపై వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినందున ఎవరు కోడ్‌ను అతిక్రమించిన ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. జాతర ముసుగులో ఎవరైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరలోని ప్రధాన కూడళ్లతోపాటు పలు చోట్ల సీసీ కెమెరాలను నిఘా ఏర్పాటు చేసి నిరంతరం పరిశీలించనున్నట్లు చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం వన్‌వే ట్రాఫిక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ ప్రధాన ఆర్చిగేటు నుంచి భక్తులు వచ్చి, దర్శన అనంతరం రత్తీరాం తండా మీదుగా నర్సంపేట రోడ్డుకు వెళ్లే ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నిబంధనలకు మద్యం అమ్మకాలు చేపడితే కేసులు పెడుతామని హెచ్చరించారు. జాతరకు పార్టీ జెండాలు లేకుండా ప్రభలు తీసుకురావచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ పవన్‌కుమార్, ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎస్ఐలు వెంకన్న, జానీపాషా, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, నాయకులు చాడా కొమురారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, సాయిలి ప్రభాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు జాన్‌విక్రం పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 16: భారత ఎన్నికల సంఘం సాధారణ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో వెంటనే కోడ్ అమలులోకి వస్తుందని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవిగుప్తా, రాష్ట్రస్థాయి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, మే 13 పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. 24గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాలు, రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫొటోలు, వాల్ రైటింగ్స్ తొలగించాలన్నారు. 48గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, 72గంటల్లో ప్రయివేట్ స్థలాల్లో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫొటోలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అక్రమ నగదు, మద్యం ఇతర ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా ముందు జాగ్రత్తచర్యలు చేపట్టాలన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సువిధా యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనల ప్రకారం సకాలంలో రాజకీయ పార్టీల అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలన్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ అధికారులు అంకితభావం, సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించి విజయవంతం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా

కేయూ భూములను కాపాడాల్సిన బాధ్యత వర్సిటీ అధికారులదే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 16: ఆక్రమణకు గురవుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం భూముల్ని కాపాడాల్సిన బాధ్యత కేయూ అధికారులపై ఉందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం కేయూలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ... ప్రహరీ నిర్మాణానికి టెండర్ పూర్తైన తర్వాత కూడా పనులను ఎందుకు ప్రారంభించలేదని ఆయన కేయూ అధికారులను ప్రశ్నించారు. కేయూ చుట్టూ పూర్తి స్థాయిలో ప్రహరీని నిర్మించి కబ్జాదారుల చెరనుంచి వర్సిటీ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, అధికారులను దాన్ని చెడగొడుతున్నారన్నారు. వర్సిటీ భూములను కాపాడాల్సిన అధికారులు కబ్జాదారులకు వంతపాడుతున్నారని, చర్యలు తీసుకోకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ బీజేపీ నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, బాకం హరిశంకర్, తీగల భరత్‌గౌడ్, కందకట్ల సత్యనారాయణ, చల్లా జైపాల్‌రెడ్డి, కనుకుంట్ల రంజిత్, వన్నాల వెంకటరమణ, జన్ను మధు, మార్టిన్ లూథర్, రఘునారెడ్డి, భరత్‌వీర్, అరణ్యరెడ్డి, శ్రీరాం రెడ్డి పాల్గొన్నారు.

లొంగుబాటలో మావోయిస్టు జ్యోతక్క?

ఖానాపురం, మార్చి 16 : మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన మావోయిస్టు జ్యోతక్క అలియాస్ ఇమాంబీబీ లొంగుబాటలో ఉన్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఆమె జనజీవన స్రవంతిలోకి రావడానికి సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం 54 ఏళ్ల వయస్సు ఉన్న జ్యోతక్క 30ఏళ్ల క్రితం అడవిబాట పట్టి అజ్ఞాతంలోకి వెళ్లిన ఆమె ప్రస్తుతం పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో టైలరింగ్ టీమ్‌లో సభ్యురాలిగా కొనసాగుతున్నారు. అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న జ్యోతక్క దండకారణ్య అడవి ప్రాంతం నుంచి స్వస్థలానికి రావాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీస్‌లను వివరణ కోరగా ఎలాంటి సమాచారం లేదన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



చెన్నారంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట రూరల్, మార్చి 16 : గ్రామాల ను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్య మని వర్ధన్నపేట ఎమ్మె ల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని ఇల్లంద, రామవరం, ఉప్పరపెల్లి, నల్లబెల్లి, చెన్నారం గ్రా మాలతో పాటు వర్ధన్నపేట పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిన విధంగా ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసిందన్నారు. మహిళల కు పెద్ద పీట వేస్తూ ప్రభుత్వం ఎన్నో మంచి నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని పథకాలను తీసుకు రావడంతో పాటు సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపును విజయవంతంగా చేస్తుందని ఆశీస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం

పర్వతగిరి, మార్చి 16 : మండలంలోని కొంకపాక గ్రామంలో రూర్బన్ పథకం కింద ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనిట్‌లో తయారయ్యే వస్తువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతో తయారుచేసిన పదార్థాలను తినడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మహిళలు కలిసికట్టుగా ఉండి యూనిట్ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం గోపనపెల్లి గ్రామ దూడెల మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేడీఏ ఉషాదయాల్, ఏవో ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ వెంకటస్వామి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ బొంపెల్లి దేవేందర్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, ఎంపీటీసీ మోహన్‌రావు, మాజీ ఉపసర్పంచ్ రంగు రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవిత అరెస్టు.. బీజేపీ, బీఆర్ఎస్‌ల డ్రామా



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ మెంబరు రంజిత్‌రెడ్డి

నెక్కొండ, మార్చి 16 : లోక్‌సభ ఎన్నికల సమయం దగ్గర పడు తుండటంతో రాష్ట్ర ప్రజ ల సానుభూతిని పొం దేందుకు బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలు ఆడుతు న్న డ్రామాల్లో భాగమే కవిత అరెస్టని నర్సం పేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం నెక్కొండలో జరి గిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసని తట్టుకోలేక ప్రజలను తప్పు దోవ పట్టించి సానుభూతి పొందేందుకు అరెస్టు నాటకానికి శ్రీకారం చుట్టారంటూ ఆరోపించారు. ఈ రెండు పార్టీల చీకటి ఒప్పందాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, డీసీసీ కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, యూత్ జిల్లా అధ్యక్షుడు బండి శివ, మండల అధ్యక్షుడు రావుల మైపాల్‌రెడ్డి , అనుముల శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాంనాయక్‌కు సన్మానం



సీతారాం నాయక్‌ను సన్మానిస్తున్న రవికుమార్, నాయకులు

నర్సంపేట, మార్చి 16 : మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయ క్‌ను బీజేపీ జిల్లా అధ్య క్షుడు గంట రవికుమా ర్‌తో పాటు ఆ పార్టీ నాయకులు శనివారం ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరి మహబూబాబాద్ ఎంపి అభ్యర్థిగా ఎంపికైన అనంతరం తొలిసారి నర్సంపేటకు వచ్చిన సీతారాంనాయక్‌కు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ సీతారాం నాయక్‌కు నర్సంపేట నియోజకవర్గంలో మెజార్టీ అందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఎంపి అభ్యర్థి సీతారాంనాయక్ మాట్లాడుతూ దేశంలో ప్రధాని చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీలో చేరానని ఆయన అన్నారు. కేసీఆర్‌ను గద్దెదించడానికే ప్రజలు ఓటేశారని ఇది కాంగ్రెస్ గొప్ప కాదన్నారు. రాబోమే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని. తనను భారీ మెజారిటీ అందించి గెలిపించాలని నాయకులను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపెల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, నియోజకవర్గ చేరికల కమిటీ చైర్మన్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు శీలం రాంబాబు, జుర్రురాజు, మినుముల రాజు, గోల్యానాయక్, వీరన్న, యువమోర్చా నాయకుడు జూలూరి మనీష్‌గౌడ్, గూడూరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌ను కలిసిన ప్రిన్సిపాల్



కమిషనర్ వెంకటేశంను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ పోషయ్య

వర్ధన్నపేట రూరల్, మార్చి 16 : తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సి పల్ సెక్రటరీ, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ బుర్ర వెంకటేశంను వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ జి.పోషయ్య ఆర్‌జేడీ ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్ రాజేందర్ సింగ్‌తో హైదరాబాదులో కలిసి శనివారం జ్ఞాపికను అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల స్థితిగతులను ఆయనకు వివరించారు. ప్రస్తుతం వర్ధన్నపేటలోని బీసీ బాలుర వసతి గృహంలో కళాశాలను నడిపిస్తుండగా, మరో రెండు సంవత్సరాల పాటు ఎంవోయూను కొనసాగించేలా చూడాలని కోరారు. దీంతో కమిషనర్ సానుకూలంగా స్పందించి విద్యార్థుల భవిష్యత్ రీత్యా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్.శ్రీనివాసరావు, సమత, మాలతి, సంధ్య, క్రిష్ణ, జ్యోత్స్న, దేవేందర్, సంధ్యారాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన ఇంటి పన్నులను వసూలు చేయండి

చెన్నారావుపేట, మార్చి 16: గ్రామాల్లో పేరుకపోయిన ఇంటి పన్నులను వసూలు చేయాలని నర్సంపేట డీఎల్‌పీవో వేదదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు అవగహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపుల దుకాణ సముదాయాలు ఏర్పాటు చేసే వారు, అనుమతి లేకుండా దుకాణాలను ఏర్పాటు చేయరాదన్నారు. ప్రతీ ఒక్కరూ అనుమతి తీసుకోవాలన్నారు. గ్రామాలకు ఆదాయ వనరులను పెంచాలని సూచించారు. డీఎల్‌పీవోను కార్యదర్శులు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం మండలంలోని తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామంలోని వన నర్సరీలను ఆమె సందర్శించారు. వేసవి కాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కవిత అరెస్టుకు నిరసనగా ఆందోళనలు



నర్సంపేటలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్సంపేట, మార్చి 16: ఎమ్మెల్సీ కల్వ కుంట్ల కవితను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ ఎస్ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనంచేశారు. బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ మాట్లాడుతూ లిక్కర్ స్కామ్‌లో సంబంధంలేని ఎమ్మెల్సీ కవితను ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఈడీ అధికారులు అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోప్యత ఒప్పందం మేరకే ఈడీ అధికారులు అక్రమంగా కవితను అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. వెంటనే కవితను విడుదల చేయాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, బీఆర్ఎస్ నాయకులు కొమాండ్ల గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రావుల సతీష్, నాగిరెడ్డి, సదానందం, రాంబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ: బీఆర్ఎస్ నాయకులపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, పట్టణ అధ్యక్షుడు కొనిజేటి భిక్షపతి ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో నర్సంపేట-నెక్కొండ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంటుక సోమయ్య, తోట సాంబయ్య, గరికపాటి కృష్ణారావు, వైస్‌ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్, మాదాసు రవి తదితరులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుకు నిరసనగా శనివారం నల్లబెల్లి బస్టాండువద్ద మండల బీఆర్ఎస్ నాయకులు పీఎం నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు బానోతు సారంగపాణి మాట్లాడుతూ.. ఈడీ దర్యాప్తు పేరుతో, సుప్రీంకోర్టు ఆర్డర్సును ఏమాత్రం లెక్కచేయకుండా మహిళను అరెస్టుచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంతేకాక, ఎంపీ ఎన్నికల్లో పార్టీని దెబ్బకొట్టాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు చెట్టుపెల్లి మురళీధర్, నానబోయిన రాజారాం, శ్రీనివాస్, ఇంగ్లీ శివాజీ, గుమ్మడి వేణు, ఆకుల సాంబరావు, బొట్ల పవన్, వక్కల చంద్రమౌళి, పాల్గొన్నారు.

• ఖానాపురం : ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ రహదారిపై బైటాయించి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, జడ్పీటీసీ బత్తిని స్వప్నశ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నేతలు తక్కళ్లపల్లి బాబురావు, సొంటి లక్ష్మణ్, మౌలాన, పూలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టుకు నిరసనగా బీజేపీకి వ్యతిరేకంగా మండలంలోని గిర్నిబావిలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రధాన రహదారిపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పీఎంకి మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, బీఆర్ఎస్ యూత్ డివిజన్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, ఎంపీటీసీ పిండి కుమారస్వామి, రాజు, పొన్నం మొగిలి, లాండె రమేశ్, సింగతి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

కవిత అరెస్టు వెనుక చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హస్తం

- బీజేపీతో కుమ్మక్కై బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెడుతున్నారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపణ

వర్ధన్నపేట రూరల్, మార్చి 16 : మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు వెనుక టీడీపీ అధినేత చంద్రబాబు, సీఎం రేవంత్‌రెడ్డి హస్తం ఉందని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. శనివారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కవిత అరెస్టును నిరసిస్తూ రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పన్ని బీఆర్ఎస్ పార్టీని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీజేపీతో పొత్తుపెట్టుకుని, సీఎం రేవంత్‌రెడ్డి పరోక్షంగా వారితో కుమ్మక్కై ఇదంతా చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు ఎవరిని ఇబ్బంది పెట్టలేదన్నారు ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కూడా కేసులు పెట్టి భయాభ్రాంత్రులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసి ఎన్నో సార్లు జైలుకు పోయారని, లాఠీ దెబ్బలు తిని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేసి కవితను అరెస్టు చేశారన్నారు. వంద రోజుల్లో స్కీంలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ చేయకుండా జాప్యంచేసిందన్నారు. అక్రమ కేసులు పెట్టి బీజేపీ కావాలని ఎన్నికల ముందే అరెస్టు చేశారని తెలిపారు. కోర్టు ఆర్డర్లు కూడా ధిక్కరించి అరెస్టు చేశారని, కేసు స్టేవచ్చి ఉన్నప్పటికీ అరెస్టు చేయడం దారుణమన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఎన్నో రకాలుగా అభివృద్ధి చేశాడని, రైతులకు కరెంటు, నీరు సకాలంలో అందించాడని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరువు ఏర్పడే అవకాశాలు వచ్చాయని ప్రజలకు ఇప్పుడు అర్థమవుతోందన్నారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వం అన్ని రకాలుగా ఫెయిలయిందని స్పష్టంచేశారు. న్యాయస్థానాలపై బీఆర్ఎస్ పార్టీకి అపారమైన గౌరవం ఉందని, న్యాయమే గెలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పోటర్ చింత యాదగిరి, జిల్లా సీనియర్ నాయకులు లలిత యాదవ్, బండి రజినీ కుమార్, దుర్గారావు, గుజ్జ గోపాల్‌రావు, భిక్షపతి, ఎంపీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

రాయపర్తి, మార్చి 16 : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణ సాధించాలని ఎంపీటీసీ ఐత రాంచందర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెన్నులు, స్కేల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు ఐత అనిల్, దళిత రత్నం అవార్డు గ్రహీత ఐత యాకయ్య, ఐత రాజు, హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి, పీరని ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కంతుల జంపి, రాకేష్, సాయి, సందీప్, మహేష్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చెన్నారావుపేట, మార్చి 16 : మండలంలోని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వారి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సంపేట మెడికల్ ఆఫీసర్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలన్నారు. విద్యార్థుల్లో వచ్చే రక్తహీనత సమస్యలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ఖానాపురం, మార్చి 16 : మండలంలోని మంగళవారిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మంజుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, నాజీతండా పాఠశాలకు చెందిన హెచ్‌ఎం జత్రాంనాయక్ తన సొంత ఖర్చులతో 21మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు, కంపాక్స్‌లను అందజేశారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ప్రసాదరావు, ఉపాధ్యాయు లు విజయలక్ష్మి, కీరియా, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాం

రాయపర్తి, మార్చి 16 : గ్రామీణ ప్రాంతాల్లో త్రాగు నీటికి ఇబ్బందులు లేకుండా చేసేందుకు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కృషి చేస్తున్నారని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని తిర్మలాయపెల్లి గ్రామంల ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో మంచినీటి సరఫరా కోసం బోరుబావికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిర్మలాయపెల్లి గ్రామం నుండి తెట్టేకుంట తండా వరకు పైపు లైను కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి వేసవి కాలంలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడొద్దని ఈ కార్యక్రమాన్ని తీసుకున్నట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకన్న, నరోత్తంరెడ్డి, మచ్చ కుమారస్వామి, గబ్బెట బాబు, మాచర్ల ప్రభాకర్, నర్సింహరెడ్డి, ఉల్లంగుల నర్సయ్య వశపాక రవి, కొంకపాక శ్రీనివాస్, ఎల్లయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల చేతిలో కొండచిలువ హతం

పర్వతగిరి, మార్చి 16 : మండలంలోని కల్లెడ, బూర్గుమళ్ల గ్రామాల్లో కొండచిలువ కలకలం రేపింది. శుక్రవారం రాత్రి కల్లెడ గ్రామంలోని చెరువుకట్టపైనుంచి బూర్గుమళ్ల గ్రామం వైపు వెళ్తుండగా కొందరు బాటసారులు దానిని వీడియో తీసి బూర్గుమళ్ల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. దీంతో పలువురు గ్రామస్థులు రాత్రి రహదారి వెంట వెతికినా కొండచిలువ కనబడలేదు. శనివారం ఉదయం పొలంపనులకు వెళ్లేవారికి కనిపించడంతో రాళ్లు, బండలతో కొట్టిచంపారు.

జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

గీసుగొండ, మార్చి 16 : కొమ్మాల శ్రీలక్ష్మినరసింహస్వామి జాతరను భక్తి పూర్వకంగా జరుపుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రవిందర్ సూచించారు. ఆలయ ప్రాంగణంలో బందోబస్త్, చేపట్టిన ముం దస్తు చర్యలపై వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని శనివారం నిర్వహించా రు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినందున ఎవరు కోడ్‌ను అతిక్రమిం చిన ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు.జాతర ముసుగులో ఎవరైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతరలోని ప్రధాన కూడళ్లతో పాటు పలు చోట్ల సీసీ కెమెరాలను నిఘా ఏర్పాటుచేసి నిరంతరం పరిశీలించనున్నట్లు చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కోసం వన్‌వే ట్రాఫిక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ ప్రధాన ఆర్చీగేటు నుంచి భక్తులు వచ్చి, దర్శన అనంతరం రత్తీరాం తండా మీదుగా నర్సంపేట రోడ్డుకు వెళ్లే ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.నిబంధనలకు మద్యం అమ్మకాలు చేపడితే కేసులు పెడుతామని హెచ్చరించారు. జారతకు పార్టీ జెండాలు లేకుండా ప్రభలు తీసుకు రావచ్చని ఆయన స్పష్టంచేశారు. కార్యక్రమంలో మామ్ము నూరు ఏసీపీ తిరుపతి, సీఐ పవన్‌కుమార్, ఎంపీపీ భీమగాని సౌజన్య ఎస్‌ఐలు వెంకన్న, జానీపాష, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, నాయకులు చాడా కొమురారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, సాయిలి ప్రభాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు జాన్‌విక్రం పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం

నెక్కొండ, మార్చి 16 : నెక్కొండ మండలం ఓ గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన ఓ ఇంటి ముందు క్షుద్రపూజలు జరిపారు. ఎర్ర రంగు బట్టలో రకరకాల వస్తులను పెట్టి అజ్ఞాత వ్యక్తులు పూజలను జరిపారు. సంఘన స్థలానికి చెరుకున్న గ్రామ ప్రజలు.. ప్రజలను భయాందోళనకు గురి చేయడానికే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడి ఉంటారంటూ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేందర్ తెలిపారు.

కుల సంఘాల భవనాలకు శంకుస్థాపన

ఖానాపురం, మార్చి 16 : మండలంలోని మంగళవారిపేట గ్రామంలో యాదవసంఘం, గౌడసంఘం భవనాలకు శని వారం శంకుస్థాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎంపీటీసీ మూడు పూల్‌సింగ్, గ్రామపార్టీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నల్లబెల్లి, మార్చి 16 : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య కార్మికులు (స్కావెంజర్స్ వర్కర్లులను) తిరిగి మళ్లీ విధుల్లోకి తీసుకుంటామనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా మని మాజీ స్కావెంజర్స్ వర్కర్లు మండలాధ్యక్షుడు పులి రమేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాజీ స్కా వెంజర్లు వర్కర్లు సీఎం రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వెంకటేశంకు ధన్యవాదాలను తెలియజేశారు.

వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో రాణించాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 16 : గ్రామీణ ప్రాంత మహిళలు వ్యాపార, పారిశ్రామిక రంగా ల్లో రాణించి ముందుకు సాగాలని వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతి అన్నారు. శనివారం మండలంలోని ఇల్లంద గ్రామంలో ఇటీవల డీఆర్డీ ఏ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినో త్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఎంటర్ ప్రైజర్ గా అవార్డు అందుకున్న మోడెం కవితను సన్మా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి వర్ధన్నపేట మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చి దిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ గోలి కొమురయ్య మాజీ సర్పంచ్ కుమార స్వామి, కార్యదర్శి రామారావు, గంగ, తుంగభద్ర, కావేరి వీవోలు బొంతల మౌనిక, స్వప్న, సుమతల, మాధవి, వీవోఏలు ఆకుల స్రవంతి, రమ్య, కత్తి స్రవంతి పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 16 : భారత ఎన్నికల సంఘం సాధారణ పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో వెంటనే కోడ్ అమలులోకి వస్తుందని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవి గుప్తా, రాష్ట్రస్థాయి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, మే 13 పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. 24గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాలు, రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫొటోలు, వాల్ రైటింగ్స్ తొలగించాలన్నారు. 48గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, 72గంటల్లో ప్రయివేట్ స్థలాల్లో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫొటోలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అక్రమ నగదు, మద్యం ఇతర ప్రలోబాలకు ఓటర్లు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సువిధా యాప్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనల ప్రకారం సకాలంలో రాజకీయ పార్టీల అభ్యర్థులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలన్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ అధికారులు అంకితభావం, సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించి విజయవంతం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ ఇన్విజిలేటర్ల బాధ్యతలివే..

దుగ్గొండి, మార్చి 16 : ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను ప్రశాంతగా, ఎలాంటి ఆరోపణలు లేకుండా పరీక్షలు జరుపుటకు అధికారులు విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లకు తగు సూచనలు, జాగ్రత్తలు జారీ చేశారు. ఇన్విజిలేటర్లు పరీక్షల సమయంలో ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. 9.30 గంటలకు పరీక్ష గదిలోకి పోవాలి. పరీక్షల సమయంలో ప్రతీ ఒక్క ఇన్విజిలేటర్ గుర్తింపు కార్డు ధరించాలి. అమ్మాయిలను మహిళా ఉపాధ్యాయులు తనిఖీ చేయాలి. విద్యార్థుల దగ్గర ఎలాంటి ఇతర పేపర్లు లేకుండా చూడాలి. ఓఎంఆర్ షీటు పేరు ఉన్న విద్యార్థికే దానిని అందించాలి. దానిపై విద్యార్థి సంతకం చేసిన తర్వాతనే ఇన్విజిలేటర్ సంతకం చేయాలి. ఓఎంఆర్ షీటుపై జవాబు పత్రం నంబర్ వేయాలి. విద్యార్థుల హాల్ టిక్కెట్లను తనిఖీ చేయాలి. ఎక్కడకూడ హాల్ టిక్కెట్ నంబర్ వేయరాదు. విద్యార్థుల దగ్గర ఎలాంటి ఎలక్ట్రాన్ వస్తువులు, సెల్ ఫోన్‌లు లేకుండా చూడాలి. ఇన్విజిలేటర్ దగ్గర సెల్ ఫోన్ ఉండరాదు. విద్యార్థులను బయటకు పంపరాదు, టాయిలెట్‌కు పంపితే వారిని పరిశీలన చేస్తూ ఉండాలి. ఇతర వ్యక్తులను పరీక్ష గదిలోకి రానియకూడదు, ఇన్విజిలేటర్ గదులు తిరుగరాదు. తప్పని పరస్థితిలో పరీక్ష గది నుంచి బయటకు పోవలసి వస్తే రిలీవర్‌ను నియమించాలి. ఫోటో అటెండెన్స్ షీటుపై విద్యార్థులచే సంతకం చేయించాలి. విద్యార్థులు పరీక్ష పేపర్లు మార్చుకోకుండా చూడాలి. పరీక్ష రాసిన తర్వాత విద్యార్థులను ఒక్కసారిగా బయటకు పంపాలి. పూర్తి స్థాయిలో సీఎస్, డీవోలకు ఇన్విజిలేటర్ సహకరించాలి.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

దుగ్గొండి, మార్చి 16 : ఈనెల 18 నుంచి జరుగబోయే పదో తరగతి పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు దుగ్గొండి, మల్లంపల్లి పరీక్ష కేంద్రాల సీఎస్‌లు రామస్వామి, భద్రమ్మలు శనివారం తెలిపారు. దుగ్గొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 150మంది, విద్యార్థులు, మల్లంపల్లి ఉన్నత పాఠశాలలో 114మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు ప్రశాంతగా నిర్వహించుటకు ఇన్విజిలేటర్ల నియామకంతో పాటు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వారు వెల్లడించారు.

• పర్వతగిరి : పదవ తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, 17వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే 16వ తేదీ శనివారమే పరీక్షల ఏర్పాట్లను పూర్తిచేశారు. ఆయా పరీక్షాకేంద్రాల్లో గదులవారీగా హాల్‌టికెట్ల నంబర్లను వేశారు. విద్యార్థులకు తాగునీటిని అందుబాటులో ఉంచనున్నట్లు పరీక్షల సూపరింటెండెంట్ పాక రమేష్‌బాబు తెలిపారు. ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి తెస్తే ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చినా అనుమతించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి హాజరయ్యేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ పి.కుమారస్వామి, సీసీ బి.కుమారస్వామి, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

పదో తరగతి ఎంతో కీలకం

నెక్కొండ, మార్చి 16 : విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలు ఎంతో కీలకమని నెక్కొండ ఎస్సై మహేందర్ అన్నారు. నెక్కొండలోని సెయింట్‌థెరిసా హై స్కూల్ విద్యార్థులకు శనివారం పదవ తరగతి పరీక్ష కిట్లు పంపిణీచేశారు. విద్యార్థులు పరీక్షలనే భయాన్ని విడనాడితే ఉత్తమ ఫలితాలను సాధిస్తారన్నారు. పాఠ్యంశాలను అర్థం చేసుకుంటూ చదవాలి తప్పా కంఠస్థం చేస్తే ఆశించిన ఫలితాలు సాధించడం కష్టమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చల్లా యాకుబ్‌రెడ్డి, కరస్పాండెంట్ మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల బహూకరణ

చెన్నారావుపేట, మార్చి 16 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బెస్ట్ రన్నర్స్ అనే సేవా సంస్థ వారు బెంచీలు, హాల్ టికెట్లను శనివారం అందించారు. సంస్థ వారు విద్యార్థులకు సుమారు రూ 1లక్ష విలువ చేసే 20 బెంచీలను అందించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, కిషోర్, సంస్థ సభ్యుడు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దుగ్గొండి, మార్చి 16 : నియోజక వర్గ ఎస్‌డీఎఫ్ నిధులతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు వివిధ రకాల అభివృద్ధి పనులకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. గిర్నిబావిలో రూ.8లక్షల సీసీ రోడ్డు పనులు, తొగర్రాయిలో రూ.3లక్షల నిధులతో బీరన్న గుడి నిర్మాణంకు, గోబ్రియా తండాలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, చలపర్తిలో రూ.3లక్షలతో సీసీ రోడ్డు పనులకు, శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్లు ఒలిగె నర్సింగరావు, చెన్నారి కిరణ్, ఉపాధ్యక్షుడు మట్ట రాజు, ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అనువుల రాజిరెడ్డి, దంజ్యానాయక్, తిరుపతి పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



వెంకన్న (ఫైల్)

పర్వతగిరి, మార్చి 16 : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రావూరు గ్రామ పంచాయతీ శివారు గుగులోత్‌తండాలో శనివారం జరిగింది. ఎస్సై గుగు లోత్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన గుగు లోత్ వెంకన్న(28) ఆటో నడుపుతూ కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే విద్యుత్‌తీగ.. ఇంట్లో బట్టలు ఆర వేసే ఇనుప తీగకు తగిలి విద్యుత్ ప్రసరణ జరిగింది. ఇది గమనించని వెంకన్న శనివారం ఉదయం ఫోన్ మాట్లాడు తూ బట్టలు ఆరవేసే ఇనుపతీగను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై కిందపడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానికుల సహకారంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారు లు ఉన్నారు. మృతుని భార్య గుగులోత్ చిట్టి ఫిర్యాదు మేర కు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

• వెంటాడుతున్న విద్యుత్ ప్రమాదాలు

తండాలను విద్యుత్ ప్రమాదాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 4వ తేదీన మోత్యాతండాలో దుర్గమ్మ పండుగ కోసం ఏర్పాట్లు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో బాలుడు ఆసుపత్రిలో పదిరోజుల పాటు చికిత్స పొంది మృతిచెందాడు. ఈ విషాదం మరువకముందే ఆదే తండాకు పక్కనే ఉన్న గుగులోత్‌తండాలో శనివారం విద్యుత్ షాక్‌తో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ఆయా తండాలలో మరింత విషాదం నెలకొంది.